జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
## మహబూబ్‌నగర్
నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట
మంగళవారం, మే 12, 2026 పేజీలు :10







## జనాభా గణనను పకడ్బందీగా నిర్వహించాలి

### గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల మే 11(ప్రజా జ్యోతి ప్రతినిధి):జనాభా గణన-2027లో భాగంగా ఈ ఏడాది మొదట ఇండ్ల గణన నిర్వహిస్తున్నందున,ఎన్యూమరేటర్లు నిర్దేశిత వివరాలన్నీ నమోదు చేసి,గణనను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఆదేశించారు.గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని లింగంబావి కాలనీ పరిసరాల్లో సోమవారం సంబంధిత బ్లాక్ ఎన్నుమరేటర్లు నిర్వహిస్తున్న హౌస్ లిస్టింగ్ గణనను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో మాట్లాడిన కలెక్టర్,హౌస్ లిస్టింగ్ ఆపరేషన్‌లో భాగంగా ప్రతి ఇంటిని తప్పనిసరిగా

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను
# వేగవంతం చేయాలి



# పేద రైతుల... శ్రేయస్సే
# ప్రభుత్వ లక్ష్యం

-రైతులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు- ధాన్యం తరలింపులో సమన్వయంతో పనిచేయాలి
-కొనుగోలు కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తప్పనిసరి - గైర్హాజరైన అధికారులకు మెమోలు జారి
- రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు

నాగర్ కర్నూల్ మే 11( ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి) రైతు కష్టానికి తగిన గౌరవం దక్కేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని, రైతు కేంద్రంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, రైతులు, కొనుగోలు దారులు, రైస్ మిల్లర్లు పూర్తి స్థాయిలో పారదర్శకంగా వ్యవహరించాలని, ఎవరూ ఎవరినీ బతిమాలుకునే పరిస్థితి రాకుండా, ఎవరు ఎవరిని నిందించాల్సిన అవసరం లేకుండా జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను సజావుగా నిర్వహించేలా అందరూ సమిష్టిగా చర్యలు తీసుకోవాలని




## ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని
# జయించాలి

- దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీలో జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా



## ఆత్మవిశ్వాసంతో వైకల్యాన్ని జయించాలి

మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : ఆత్మవిశ్వాసం ఉంటే వైకల్యాన్ని కూడా జయించవచ్చని జిల్లా కలెక్టర్ ఖుష్బు గుప్తా పేర్కొన్నారు. సోమవారం మహబూబ్‌నగర్ అర్బన్ భవిత కేంద్రంలో జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష, అలింకో ఆధ్వర్యంలో నిర్వహించిన దివ్యాంగ విద్యార్థులకు ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. జిల్లాలోని 172 మంది ప్రత్యేక అవసరాలు గల విద్యార్థులకు వీల్ చైర్లు, ట్రైసైకిళ్లు, రోలేటర్లు, సీపీ చైర్లు, వినికిడి యంత్రాలు, టీఎల్ఎం కిట్లు, బ్రెయిలీ కిట్లు తదితర ఉపకరణాలను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైకల్యం అనేది శరీరానికే తప్ప మేధస్సుకు కాదని అన్నారు. ఎన్నో మంది దివ్యాంగులు ఆత్మవిశ్వాసంతో జీవితంలో అద్భుత విజయాలు సాధించారని గుర్తు చేశారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించి సాధారణ పిల్లల మాదిరిగానే చదువుకునేలా చూడాలని సూచించారు.

భవిత కేంద్రాలకు వచ్చే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్ట్ అలవెన్స్, సాధారణ పాఠశాలలకు హాజరయ్యే బాలికలకు గర్ల్స్ స్టైపెండ్, ఇతరుల సహాయంతో బడికి వచ్చే వారికి ఎస్కార్ట్ అలవెన్స్, కంటి చూపు తక్కువగా ఉన్న విద్యార్థులకు రీడర్ అలవెన్స్ అందజేస్తున్నట్లు తెలిపారు. పూర్తిగా పాఠశాలకు రాలేని విద్యార్థులకు ఇంటివద్దనే విద్య అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఉచితంగా ఉపకరణాలు అందిస్తూ, వారు రోజువారీ కార్యక్రమాలు స్వయంగా చేసుకునేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని చెప్పారు. సదరం సర్టిఫికెట్ రిన్యువల్ చేసుకోవాలని, లేకపోతే ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు నిలిచిపోయే అవకాశం ఉందని హెచ్చరించారు. భవిత కేంద్రాల్లో నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అనంతరం జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ, ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవిత కేంద్రాలకు క్రమం తప్పకుండా పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహిస్తే వారు కూడా అన్ని రంగాల్లో రాణించగలరని తెలిపారు. వారిపై ఎలాంటి వివక్ష చూపరాదని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, జిల్లా విలీన విద్య సమన్వయకర్త సుధాకర్ రెడ్డి, అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్, అర్బన్ మండల విద్యాధికారి లక్ష్మణ్ సింగ్, ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ప్రత్యేక ఉపాధ్యాయులు శ్రీనివాసులు, రఘుబాబు, శివశంకర్, మైబన్న, నందన్, మాన్యమయ్య, సంగీత, విజయలక్ష్మి, సునీత, అనురాధ తదితరులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జనాభా గణనను పకడ్బందీగా నిర్వహించాలి

కవర్ చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఎన్యూమరేటర్ తమకు కేటాయించిన పరిధిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, మూడు రోజుల్లో మ్యాపింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశించారు. రోడ్లు, సందులు, ఇంటి నంబర్లు, లైన్ నంబర్లను స్పష్టంగా గుర్తిస్తూ పెన్సిల్‌తో మ్యాప్ రూపొందించుకోవాలని సూచించారు. ఇంటి నంబర్లు, లైన్ నంబర్లను మార్కర్ ఆధారంగా నమోదు చేస్తే భవిష్యత్తులో పరిశీలన, రీ-వెరిఫికేషన్ సులభమవుతుందని తెలిపారు. తమ బ్లాక్ పరిధిలో రోజుకు కనీసం 20 ఇళ్లను కవర్ చేస్తే నిర్ణీత గడువులోగా ఇండ్ల గణన ప్రక్రియ పూర్తవుతుందని పేర్కొన్నారు. గణన సిబ్బంది ఇంటింటికి వెళ్లే సమయంలో తప్పనిసరిగా అధికారిక ఐడి కార్డు ధరించాలని, ప్రజల్లో అనుమానాలు లేకుండా విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. శానిటేషన్ వాహనాలు, వాట్సాప్ గ్రూపులు, మహిళా సంఘాలు, ఆర్పీలు, స్థానిక చానళ్ల ద్వారా గణనపై ప్రజలకు అవగాహన కలిగేలా పెద్ద ఎత్తున ప్రచారం చేపట్టాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న గణనను కూడా సంబంధిత చార్జ్ అధికారులు క్షేత్రస్థాయిలో తరచూ పరిశీలించాలని ఆదేశించారు. సెల్ఫ్ ఎన్యుమరేషన్ చేసిన కుటుంబాల వివరాలను కూడా సరిచూసుకుని సంబంధిత యాప్‌లో ఖచ్చితమైన గణాంకాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. జనగణన విజయవంతం కావాలంటే ప్రజల సహకారం అత్యంత అవసరమని, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు. ఈ పర్యటనలో గద్వాల మున్సిపల్ కమిషనర్ జానకి రామ్ సాగర్, తహసిల్దార్ హరికృష్ణ, అదనపు చార్జ్ అధికారి రాజేశ్వర్ రెడ్డి, సూపర్వైజర్లు, ఎన్యూమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## పేద రైతుల... శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు స్పష్టం చేశారు. సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని సుఖ జీవన్ రెడ్డి ఫంక్షన్ హాల్‌లో రబీ 2025--26 సీజన్‌కు సంబంధించిన వరి, మొక్కజొన్న కొనుగోళ్ల ఏర్పాట్లపై జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధ శాఖల ఉన్నతాధికారులు, డీసీఓల సీఈఓలు, డీఆర్‌డీఓల ఏపీఎంలు, మండల వ్యవసాయ అధికారులు, సివిల్ సప్లైస్ అధికారులు, మార్కెటింగ్, రవాణా, లీగల్ మెట్రాలజీ శాఖల అధికారులు, రా మరియు బాయిల్డ్ రైస్ మిల్లుల ప్రతినిధులు, లారీ కాంట్రాక్టర్లు, ఏఎంసీ కార్యదర్శులతో లతో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా స్థాయి విస్తృత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుంటోందన్నారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేసి గిట్టుబాటు ధర కల్పించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందని, ప్రతి అంశాల వారీగా కులంకషంగా చర్చించి కొనుగోలు ప్రక్రియలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై, జిల్లా కలెక్టర్ అధికారులకు పలు అంశాలపై సూచనలు జారీ చేశారు. సమావేశానికి హాజరుకాని అధికారుల కు మెమోలు జారీ చేయాలని మంత్రి కలెక్టర్ ను ఆదేశించారురైతులకు అన్యాయం జరిగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, వరి కొనుగోలు ప్రక్రియలో మిల్లర్లు కూడా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి జాప్యం వల్ల రైతులు నష్టపోకుండా చూడాలని, రవాణా కాంట్రాక్టర్లు సమయానికి లారీలను అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా సమన్వయంతో పనిచేయాలని, మంత్రి సూచించారు.

లారీల యజమానులు లారీలతో అవసరమైన సామర్థ్యాలను పెంచాలన్నారు, క్లస్టర్ స్థాయిలో పనిచేసే వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా ఆయా క్లస్టర్లలో వేసే పంటల వివరాలను పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు అందజేయాలని, అక్క సమాచారంతో అందజేస్తే కొనుగోలు ప్రక్రియకు కావలసిన ఏర్పాట్లకి ఎలాంటి ఇబ్బందులు ఉండవని వచ్చే సంవత్సరం నుండి వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి పంట వివరాలను ముందస్తుగానే సంబంధిత అధికారులకు తెలియజేయాలనిసూచించారుధాన్యం సేకరణ గరిష్ట స్థాయికి చేరుకున్న నేపథ్యంలో, నిల్వల వద్ద ఆలస్యం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం అవసరమని, నాగర్ కర్నూల్ జిల్లా వ్యాప్తంగా రబి సీజన్లో 1,87418 ఎకరాల్లో దాదాపుగా 1 లక్ష 20 వేల మంది రైతుల నుండి 4 లక్షల 44033 మెట్రిక్ టన్నుల వరి దిగుబడి వస్తుందని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారని రైతులు తమ పంటకు న్యాయమైన ధర పొందేలా ప్రభుత్వం చేపట్టిన వరి కొనుగోలు కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

కొనుగోలు ప్రక్రియలు సజావుగా జరిగేలా ప్రతి మండలానికి వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేసి అందులో కొనుగోళ్లు వచ్చే సమస్యలను వెల్లడిస్తే వెంటనే అధికారులు, ప్రజా ప్రతినిధులము స్పందించి వాటిని పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, కొనుగోలు కేంద్రాల్లో ఎలాంటి అవకతవకలు, జాప్యాలు చోటుచేసుకోకుండా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చిన తర్వాత రోజుల తరబడి వేచి ఉండే పరిస్థితి రాకూడదని, వెంటనే తూకం వేసి కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు తప్పనిసరిగా కల్పించాలని, తాగునీరు, షెడ్లు, గన్నీ బ్యాగులు, హమాలీల సౌకర్యం, తూకం యంత్రాలు, తరలింపు వాహనాలు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురిచేయరాదని, నాణ్యత ప్రమాణాల్లో పారదర్శకత పాటించాలని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో వరి, మొక్కజొన్న కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. ప్రతి కొనుగోలు కేంద్రంపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగుతుందని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. రైతులు ఎక్కడైనా సమస్యలను ఎదుర్కొంటే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా, మొక్కజొన్న కొనుగోలు చేసి అందుకు అవసరమైన గోదాములు జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రైతులు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోందని, కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. నాగర్ కర్నూల్ నియోజకవర్గం పరిధిలో ఈ సీజన్లో మొక్కజొన్న దిగుబడి గణనీయంగా వచ్చిందని 3 లక్షల టన్నుల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి జరిగిందని, అందుకు అనుగుణంగా రైతులకు ఇబ్బందులు లేకుండా మూడు లక్షల గన్ని బ్యాగుల సరఫరా చేయాలని, మొక్కజొన్న కొనుగోలు చేసి వెంటనే గూడాన్లకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమం ప్రభుత్వంగా రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని అందుకు అనుకూలంగా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మిల్లర్లు, అధికారులు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. కొనుగోలు ప్రక్రియ ముందుగానే ఇలాంటి సమావేశాలు మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించి రైతుల మేలు జరిగేలా చేయడం సంతోషనియమని అధికారులందరు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి ఈ సందర్భంగా సూచించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ.... రైతుల కష్టాన్ని దృష్టిలో ఉంచుకుని అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని సూచించారు.

సమావేశంలో అధికారులు కొనుగోలు కేంద్రాల నిర్వహణ, గన్నీ బ్యాగుల సరఫరా, ధాన్యం నిల్వ, రవాణా, తేమ శాతం నిర్ధారణ, రైతులకు చెల్లింపుల ప్రక్రియ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. రైతుల ప్రయోజనాలను కాపాడే విధంగా ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని నిర్ణయించారు. కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో మొక్కజొన్న ,వరి కొనుగోలు ప్రక్రియలు సజావుగా జరుగుతున్నాయని, కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో పొద్దు తిరుగుడు పంట దిగుబడి ఎక్కువగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేలా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తో మాట్లాడి వెంటనే కొనుగోలు ప్రక్రియలు ఏర్పాటు చేయాలని మంత్రి జూపల్లి కృష్ణారావును ఎమ్మెల్యే కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించి వ్యవసాయ శాఖ మంత్రి తో మాట్లాడి రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాటు చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అంతకుముందు అధికారులు జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల వివరాలు, ఇప్పటివరకు జరిగిన ఏర్పాట్లు, ధాన్యం నిల్వ సామర్థ్యం, రవాణా సదుపాయాలపై ప్రజాప్రతినిధులకు వివరించారు.

## ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలి

నారాయణపేట ప్రతినిధి మే 11 ప్రజా జ్యోతి

ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను ఎస్ఐఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం తెలంగాణ చీఫ్ ఎలక్ట్రోరల్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి హైదరాబాద్ నుంచి ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి నారాయణపేట జిల్లా నుంచి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ ప్రియాంక హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట వంటి నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం ఇప్పటికే 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారుజిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. మ్యాపింగ్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్ఐఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ఎస్ఐఆర్ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని కూడా వినియోగించుకోవాలని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను గుర్తించి నియమిస్తున్నామని, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ప్రతి అర్హ ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి ఇంచార్జీ ఆర్.డి.ఓ. రాజేందర్ గౌడ్, పాల్గొన్నారు

## ఈ నెల 14 న, మణికంఠ ఆసుపత్రిలో ఉచిత 'ఫైబ్రో స్కాన్' శిబిరం

నాగర్ కర్నూల్ : మే 11(ప్రజా జ్యోతి)

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని శ్రీ మణికంఠ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో కాలేయ వ్యాధుల పట్ల అవగాహన మరియు ముందస్తు తనిఖీల్లో భాగంగా ఈ నెల 14 న (గురువారం) ఉదయం 9:00 నుండి సాయంత్రం 5:00 వరకు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు డాక్టర్. జగదీశ్ మణికంఠ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు సుమారు 5,000 రూపాయల విలువైన 'ఫైబ్రో స్కాన్' పరీక్షను అందించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంలో విద్య అభివృద్ధికి మరో ముందడుగు

## -ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలుర టాయిలెట్స్ నిర్మాణానికి ఘనంగా భూమి పూజ చేసిన స్కూల్ చైర్మన్ గ్రామ సర్పంచ్

**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) మే 11:** జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం గోపాల్ దిన్నే గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో బాలుర టాయిలెట్స్ నిర్మాణానికి సోమవారం రోజు ఘనంగా భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ, సల్వారెడ్డి,అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ లలిత గోపాల్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..కాంగ్రెస్ ప్రభుత్వంలో అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. బాలురకు ప్రత్యేక టాయిలెట్స్ ఏర్పాటు కావడం ద్వారా పరిశుభ్రమైనవాతావరణంలో విద్యాభ్యాసం కొనసాగించేందుకు ఎంతోఉపయోగపడుతుం



దనిపేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోకుండా అభివృద్ధి చెందాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ సంకల్పం అని అన్నారు. గ్రామాభివృద్ధితో పాటు విద్యాభివృద్ధి కూడా సమానంగా కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సెక్రెటరీ రామకృష్ణ, స్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాఘవేందర్ రెడ్డి, ఉపాధ్యాయుడు గోపి, గ్రామ పెద్దలు మహేశ్వర్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,ఉప సర్పంచ్ మద్దిలేటి,వార్డ్ మెంబర్ రంగస్వామి, వెంకటన్న,బుజ్జి, యుగంధర్,మేస్త్రీ రాముడు,మాజీ సర్పంచ్ సుందర్,వరుష,కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఒకటో వార్డులో పర్యటించిన జిల్లా కలెక్టర్

- క్షేత్రస్థాయిలో పారిశుద్ధ్య పనుల పరిశీలన.
- వయోవృద్ధుల ఆశ్రమం, బాల సదనం సందర్శన.



**నారాయణపేట ప్రతినిధి మే 11 (ప్రజాజ్యోతి)** జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సోమవారం ఉదయం నారాయణపేట మున్సిపాలిటీలో పరిధిలో గల ఒకటో వార్డులో విస్తృతంగా పర్యటించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 90 రోజుల కార్యాచరణలో భాగంగా ఒకటో వార్డులో కొనసాగుతున్న పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ ను మున్సిపల్ చైర్ పర్సన్ కొండా శ్వేతా సత్య యాదవ్ తో కలిసి కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పరిశీలనలో భాగంగా వార్డులో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు, మురుగు కాల్వల పరిశుభ్రతపై



ఎలా ఉందో వార్డు వాసులతో వాకబు చేశారు. ఇళ్లలో పోగు అయ్యే చెత్తను చెత్తను మున్సిపాలిటీ చెత్త సేకరణ ఆటోలలోనే వెయ్యాలని, ఆరుబయట పరిసరాలలో వేయవద్దని వార్డు ప్రజలకు కలెక్టర్ సూచించారు. వార్డులలో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, పారిశుద్ధ్య సేవలను మరింత మెరుగు పరచాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు. అంతకు ముందు కలెక్టర్ ఒకటో వార్డు బారంబావి సమీపంలో గల వయోవృద్ధుల ఆశ్రమాన్ని సందర్శించి, అక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల యోగ క్షేమాల గురించి అడిగి, వారిని ఎంతో ఆప్యాయంగా పలకరించారు. ఆశ్రమంలో ఎంతమంది వృద్ధులు ఉన్నారని, వారికి కల్పిస్తున్న వసతి సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఆశ్రమంలో అవసరైన సదుపాయాలను నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం పక్కనే ఉన్న బాలసదన్ కూడా కలెక్టర్ సందర్శించారు అక్కడున్న విద్యార్థుల తో ముచ్చటించారు. విద్యార్థుల వివరాలను తెలుసుకున్న ఆమె ఎవరెవరు ఏ, ఏ తరగతులు చదువుతున్నారనీ విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. సదనం లోని గదులను పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న అల్పాహారం, భోజన సదుపాయాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. వంట గదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ వైస్ చైర్ పర్సన్ మంజుల, కమిషనర్ ఎన్.శంకర్, వార్డు కౌన్సిలర్ సుతారి సత్య రఘుపాల్ రెడ్డి, ఇంజినీర్ మహేష్, పర్యావరణ ఇంజనీర్ భరత్, మున్సిపాలిటీ జవాన్లు, వాటర్, ఎలక్ట్రికల్, ఇంజనీరింగ్ విభాగాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు


# ప్రజావాణి ద్వారా బాధితులకు సత్వర న్యాయం

## జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు



**గద్వాల మే 11(ప్రజా జ్యోతి ప్రతినిధి):** జోగులాంబ గద్వాల జిల్లా ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి బాధితులకు సత్వర న్యాయం చేయడం కోసం ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీఎస్పీలు,సర్కిల్ అధికారుల సమక్షంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 13 ఫిర్యాదులను స్వీకరించినట్లు పేర్కొన్నారు. ఆయా ఫిర్యాదులపై సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ,ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడమే లక్ష్యంగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు,సిబ్బంది స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి,వారి వినతులు,ఫిర్యాదులను స్వీకరించి అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చూడాలని సూచించారు. దీంతో ప్రజల్లో పోలీస్ శాఖపై భరోసా,నమ్మకం పెరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి,వాటి పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందిస్తున్నామని తెలిపారు. ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా వాటిని త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. సోమవారం అందిన ఫిర్యాదుల్లో భూ వివాదాలకు సంబంధించినవి 6,ప్లాట్ల ఆక్రమణకు సంబంధించినది 1,గొడవలకు సంబంధించినవి 2,బంగారు దొంగతనానికి సంబంధించినది 1,ఇతర అంశాలకు సంబంధించినవి 3 ఫిర్యాదులు ఉన్నట్లు తెలిపారు.

# గద్వాల సీనియర్ జర్నలిస్టు దేవిడ్ రాజు మృతి



**గద్వాల మే 11(ప్రజా జ్యోతి):** జోగులాంబ గద్వాల జిల్లా సీనియర్ జర్నలిస్టు కే.దేవిడ్ రాజ్ (61) సోమవారం తెల్లవారుజామున అకస్మాత్తుగా ఛాతి నొప్పి రావడంతో మరణించినట్లు ఆయన కుమారుడు తెలిపారు. గత 30 ఏళ్లుగా ఆంధ్రప్రభ ఇతర దినపత్రికలలో పనిచేసి సీనియర్ జర్నలిస్టుగా కొనసాగుతున్నారు. దేవిడ్ రాజుకు భార్య ఇద్దరు కుమారులు కాగా భార్య,పెద్ద కుమారుడు గత 10 సంవత్సరాల క్రితం మరణించారు. రాజు మృతి పట్ల జర్నలిస్టు సంఘాలు సంతాపం వెలిబుచ్చాయి.

సీనియర్ జర్నలిస్ట్ దేవిడ్ రాజ్ మృతికి టిడబ్ల్యూజేఎఫ్ నేతల నివాళి సీనియర్ జర్నలిస్ట్ దేవిడ్ రాజ్ అకాల మరణం పట్ల తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) జోగులాంబ గద్వాల జిల్లా నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.గిరిబాబు మాట్లాడుతూ,దేవిడ్ రాజ్ గత 35 సంవత్సరాలుగా చిన్న,మధ్య,దినపత్రికల్లో జర్నలిస్టుగా పనిచేస్తూ జీవనం సాగించారని తెలిపారు. సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో ఆయన అకాల మరణం చెందడం బాధాకరమన్నారు. దేవిడ్ రాజ్ కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు శ్రీనివాసులు,కేబీ తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.



# రాఘవేంద్ర కాలనీలో ఘనంగా శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం

**గద్వాల మే 11(ప్రజా జ్యోతి):** గద్వాల పట్టణంలోని రాఘవేంద్ర కాలనీలో నిర్వహించిన శ్రీ శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణ మహోత్సవం భక్తి పారవశ్యంతో,ఆధ్యాత్మిక శోభతో ఘనంగా జరిగింది. మహోత్సవం సందర్భంగా కాలనీ మొత్తం భక్తిమయ వాతావరణంతో కళకళలాడింది. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు,అభిషేకాలు,హోమాలు నిర్వహించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అత్యంత వైభవంగా సాగింది. స్వామివారి కళ్యాణం కన్నుల పండువగా నిర్వహించగా,భక్తులు భక్తి గీతాలు,హరినామ సంకీర్తనలు ఆలపిస్తూ కార్యక్రమాన్ని మరింత ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో పాల్గొని ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. కార్యక్రమానికి హాజరైన భక్తులకు నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులందరూ స్వామివారి దివ్య ఆశీస్సులు పొందుతూ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కాలనీ యువకులు,పెద్దలు,మహిళలు సమిష్టిగా మహోత్సవాన్ని నిర్వహించడం విశేషంగా నిలిచింది. శ్రీ సత్యనారాయణ స్వామి కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు. ఈ మహోత్సవం గద్వాల పట్టణంలో ఆధ్యాత్మిక వైభవానికి నిదర్శనంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఆర్.నాగేందర్,ప్రధాన కార్యదర్శి పోతు ఈశ్వరయ్య,ఉపాధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్,కోశాధికారి వెంకటయ్య,ఆలయ కమిటీ సభ్యులు,గద్వాల మాజీ మున్సిపల్ చైర్మన్ బి.వేణుగోపాల్ ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్నారు.



# బండి సంజయ్‌ను బర్తరఫ్ చేయాలి

## బిఆర్ఎస్ పార్టీ నాయకులు డిమాండ్

**గద్వాల (ప్రజా జ్యోతి) మే 11:**
గద్వాల జిల్లా కేంద్రంలోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో గద్వాల నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జి బాసు హనుమంతు నాయుడు మీడియా సమావేశం నిర్వహించారు. అనంతరం సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ..కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసులో వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.మాజీ మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాసు హనుమంతు నాయుడు మాట్లాడుతూ..బాలిక ఫిర్యాదు చేసినప్పటికీ కేసు నమోదు చేయడంలో ఆలస్యం జరిగిందని,నాలుగు రోజులు గడిచినా నిందితుడిపై చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. కాంగ్రెస్,బీజేపీ మధ్య చీకటి ఒప్పందం వల్లే కేసులో జాప్యం జరుగుతోందని ఆరోపించారు.చట్టం అందరికీ సమానమైతే వెంటనే నిందితుడిని అరెస్ట్ చేయాలని,కేంద్ర మంత్రివర్గం నుంచి బండి సంజయ్‌ను



బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.బాధిత కుటుంబానికి రక్షణ కల్పించి న్యాయం చేయాలని కోరారు.
ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు చంటన్న, కమ్మరి సునీతా రాము, లత రామకృష్ణ,చిత్తరి కిరణ్,నరసింహులు, గువ్వల గోపాల్,మోహన్ యాదవ్,సూర్య గౌడ్, బీచుపల్లి,గంజిపేట రాజు,వెంకటేష్ నాయుడు,శ్రీరాములు, లక్ష్మారెడ్డి,కావాలి గోపి, రాము,మాలిక్,వినయ్, కృష్ణ,రాముడు, మల్లికార్జున్,మహేందర్, నరేష్,హరికృష్ణ,ల్వీరేష్, హరిబాబు,సురేష్ తదితర పార్టీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 41 ఫిర్యాదులు

### -ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి
### -జిల్లా కలెక్టర్ ప్రియాంక.



**నారాయణపేట ప్రతినిధి మే 11 ప్రజా జ్యోతి**
ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి. హాజరయ్యారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలను జిల్లా కలెక్టర్ అదనపు కలెక్టర్ కు సమర్పించగా, ప్రజల ఫిర్యాదులను సమస్యలను సావధానంగా విన్న కలెక్టర్ సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా సోమవారం నాటి ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 41 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ ఫణీంద్ర రెడ్డి,వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలి

### - జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.




**నారాయణపేట ప్రతినిధి మే 11 ప్రజా జ్యోతి**
జిల్లాలో మహిళా సంఘాల మాదిరిగా కిశోర (15 నుంచి 18 సంవత్సరాల లోపు) బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. జిల్లాలోని ప్రతీ గ్రామంలో ఎంత మంది కిశోర బాలికలు ఉన్నారు ?. వారిలో ఎంత మంది సంఘాల్లో ఉన్నారు? ఇంకా ఎంత మంది సంఘాలలో చేరలేదు అనే పూర్తి సమాచారం తెలుసుకోవాలన్నారు. స్నేహ సమ్మర్ క్యాంప్ క్యాలెండర్ ను విడుదల చేశామని, ఆ క్యాలెండర్ ప్రకారం కిషోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యంగా ఎంపీడీవోలతో సమన్వయం చేసుకుని ఎక్కువ కిశోర బాలికల సంఘాలను ఏర్పాటు చేయించాలని జెడ్పీ సీ ఈ వో శ్రీనివాస్ రావు కు సూచించారు. స్నేహ సమ్మర్ క్యాంప్ చాలా ముఖ్యమైనదని ఆమె తెలిపారు. జిల్లాలో బాల్య వివాహాలు జరిగే మండలాలలో అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని, తాను ఆ కార్యక్రమాలకు హాజరవుతానని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో విద్యా శాఖ, వ్యవసాయ శాఖలను పర్యవేక్షణ చేశానని, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పనితీరు ఏ మాత్రం బాగా లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సెర్ప్ యాక్టివిటీస్ కూడా సంతృప్తికరంగా లేవని అసహనం వ్యక్తం చేశారు. అన్నింట్లో చివరి స్థానంలో ఉందన్నారు. కొత్త డీఆర్డీవో వచ్చాక స్వయంగా తానే సమీక్ష చేస్తానని ఆమె స్పష్టం చేశారు. జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలోనూ మరిన్ని కొత్త కొత్త కార్యక్రమాలు, వ్యాపారాలకు శ్రీకారం చుట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జయ చంద్రమోహన్, డిపివో సుధాకర్ రెడ్డి, డీపీ ఎం, ఏపీఎంలు, సీ సీ లు తదితరులు పాల్గొన్నారు.

## జన గణన ప్రచార వాహనాన్ని ప్రారంభించిన కలెక్టర్

**నారాయణపేట ప్రతినిధి మే 11 ప్రజా జ్యోతి**
జిల్లా కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జిల్లా కలెక్టర్ సీ.హెచ్. ప్రియాంక జన గణన ప్రచార వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. జన గణనలో భాగంగా మొదటి దశ హౌస్ లిస్టింగ్ ప్రక్రియ ఈ నెల 11వ తేదీ నుండి వచ్చే నెల 9వ తేదీ వరకు నెల రోజుల పాటు జిల్లాలో జరగనుందని కలెక్టర్ తెలిపారు.ఈ గృహ గణనలో భాగంగా ఎన్యుమరేటర్లు సుమారు 33 ప్రశ్నలు అడుగుతారని, ప్రజలు సరైన సమాధానాలు చెప్పి జిల్లాలో జన గణన ప్రక్రియను విజయవంతం చేయాలన్నారు. కాగా ఈ నెల రోజుల పాటు ప్రచార వాహనం జన గణన పై గ్రామ గ్రామాన విస్తృత ప్రచారం చేయనుంది. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫణీంద్ర రెడ్డి, సీపీఓ కాఘువాహన్, డీపీ ఆర్వో రషీద్, ఎస్సీ కార్పొరేషన్ ఈ డీ అబ్దుల్ ఖలీల్, సీపీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు తప్పనిసరి



**గద్వాల మే 11(ప్రజా జ్యోతి):**
జోగులాంబ గద్వాల జిల్లాలో ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు శాతం ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రైతులు పెద్ద ఎత్తున నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.రైతులకు ప్రభుత్వ పథకాలు,సబ్సిడీలు,పంటల సంబంధిత సేవలు,బీమా, రుణాలు,ఇతర వ్యవసాయ ప్రయోజనాలు సకాలంలో అందించేందుకు ఫార్మర్ రిజిస్ట్రీ ఎంతో కీలకమన్నారు.ఇప్పటికీ నమోదు చేసుకోని రైతులు వెంటనే తమ సమీప వ్యవసాయ విస్తరణ అధికారి,రైతు వేదిక,గ్రామ పంచాయతీ కార్యాలయం,సంబంధిత కేంద్రాలను సంప్రదించి నమోదు ప్రక్రియ పూర్తి చేసుకోవాలని సూచించారు.ఫార్మర్ రిజిస్ట్రీ కోసం రైతులు తమ ఆధార్ కార్డు,మొబైల్ నెంబర్,పట్టాదారు పాసు పుస్తకం పత్రాలను వెంట తీసుకెళ్లాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలి

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్



**గద్వాల మే 11(ప్రజా జ్యోతి ప్రతినిధి):**

జిల్లాలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఇప్పటివరకు 74.82 శాతం పూర్తయిందని,వంద శాతం పూర్తయ్యేలా ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి సోమవారం హైదరాబాద్ నుంచి సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి ఎస్ఐఆర్ ప్రక్రియపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ,రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల మ్యాపింగ్ పురోగతి ఆశించిన స్థాయిలో లేదని ఆందోళన వ్యక్తం చేశారు.ప్రస్తుతం కొన్ని నియోజకవర్గాలు మాత్రమే 90 శాతం పురోగతి సాధించాయని తెలిపారు.వచ్చే 15 రోజుల్లో అన్ని జిల్లాలు వేగంగా పని చేసి 90 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని అధికారులను ఆదేశించారు.జీహెచ్ఎంసీ పరిధిలో గత 10--15 రోజులలో రెండు లక్షలకు పైగా మ్యాపింగ్ నమోదు కావడాన్ని అభినందించిన సీఈఓ,ఇతర జిల్లాలు కూడా అదే స్థాయిలో పురోగతి సాధించాలని సూచించారు.ఎన్నికల మ్యాపింగ్ ప్రక్రియలో తప్పులు జరగకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.ఒక ప్రాంతానికి చెందిన ఓటరును మరో ప్రాంతంలో మ్యాప్ చేసిన ఘటనలు తమ దృష్టికి వచ్చాయని,ఇటువంటి పొరపాట్లను వెంటనే సరిదిద్దాలని అధికారులను ఆదేశించారు. అనధికార వ్యక్తులు,రాజకీయ ప్రతినిధులు నేరుగా మ్యాపింగ్ ప్రక్రియలో జోక్యం చేసుకోవద్దని,కేవలం ఇళ్ల గుర్తింపు లేదా సమాచారపరంగా మాత్రమే సహకరించాలని స్పష్టం చేశారు.ప్రతి రోజు మ్యాపింగ్ పురోగతి,పంపిణీ చేసిన ఫారాలు,సేకరించిన ఫారాల వివరాలను తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు.అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు.ప్రజలకు అందుబాటులో ఉండేలా వీఆర్వోలు,బీఎల్ఓల పేర్లు మరియు ఫోన్ నంబర్లను విస్తృతంగా ప్రచారం చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు,పారదర్శకతతో పని చేయాలన్నారు.ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి సంబంధిత అధికారులతో కలిసి వీసీ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ,ఎస్ఐఆర్ లో గద్వాల మండలం వెనుకబడిందని,ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత అధికారులు పరిష్కరించి,ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు.ఓటరు జాబితా సమగ్ర సవరణ ప్రక్రియలో మన జిల్లా రాష్ట్రంలోనే ముందుండేలా సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో ఎన్నికల విభాగం అధికారులు మంజుల,సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల్లో కళాశాల బ్రోచర్ ఆవిష్కరణ






## వివిధ విభాగాలతో ఎంఓయూ ఒప్పందాలు

**గద్వాల (ప్రజా జ్యోతి) మే 11:**
గద్వాల పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మి దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య షేక్ కలందర్ భాష అధ్యక్షతన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక"లో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల విద్యా వారోత్సవాల తొలి రోజు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల బ్రోచర్ను ఆవిష్కరించారు.
అలాగే తెలుగు,ఇంగ్లీష్, కామర్స్ విభాగాలు పాలమూరు యూనివర్సిటీ పీజీ సెంటర్ గద్వాలలోని ఆయా విభాగాలతో వివిధ అంశాలపై మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ) ఒప్పందాలను కుదుర్చుకున్నాయి అదేవిధంగా రాష్ట్రీయ కళామంచు హైదరాబాద్ సంస్థ కూడా కళాశాల ఐక్యూఏసీ విభాగంతో పలు అంశాలపై ఎంఓయూ ఒప్పందం చేసుకుంది. ఈ సందర్భంగా పీజీ సెంటర్ గద్వాల ప్రిన్సిపల్ డాక్టర్ చవ్వా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ..విద్యాసంస్థల మధ్య ఎంఓయూ ఒప్పందాలు కుదుర్చుకోవడం ద్వారా విద్యార్థులు వివిధ అంశాలపై అవగాహన పెంపొందించుకోవడంతో పాటు సృజనాత్మకతను అభివృద్ధి చేసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కే చంద్రమోహన్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ శ్రీమతి ఏ రాధిక,దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ కె సత్యన్న, తెలుగు విభాగాధిపతి ఎంహెచ్ నాగభూషణం,కామర్స్ విభాగాధిపతి సురేందర్ రెడ్డి,రాష్ట్రీయ కళామంచ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ కరుణాకర్,ఇంగ్లీష్ విభాగం ఇన్చార్జ్ ఈ మల్లికార్జున్ గౌడ్,డాక్టర్ సత్యమ్మ,కే భాస్కర్,పవన్ కుమార్, జిటి పద్మ,ఎస్ శంకర్, పరశురాములు, నారాయణ తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

## పరిశుభ్రమైన భోజనం అందించడమే లక్ష్యం



**చిన్నంబావి, మే 11 ( ప్రజాజ్యోతి )**
చిన్నంబావి మండలంలోని పెద్దమారూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతన కిచెన్ షెడ్ను గ్రామ సర్పంచ్ కేతపాగ జయమ్మ, ఉప సర్పంచ్ నరేష్ యాదవ్ సోమవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం పాఠశాల వంటశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా సర్పంచ్ జయమ్మ మాట్లాడుతూ.. పాఠశాలలో సరైన వంటశాల లేకపోవడంతో విద్యార్థులు, వంట సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని జూపల్లి కృష్ణారావు సహకారంతో నూతన కిచెన్ షెడ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇకపై విద్యార్థులకు సమయానికి పరిశుభ్రమైన, నాణ్యమైన భోజనం అందించే అవకాశం కలుగుతుందన్నారు.పాఠశాల అభివృద్ధికి గ్రామ ప్రజాప్రతినిధులు, సహకరించడం అభినందనీయమని హెచ్ఎం రవణమ్మ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి శ్రీనివాసులు, కొప్పునూరు సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నరసింహారెడ్డి, హనుమంతరావు, కే.లక్ష్మయ్య, మాజీ సర్పంచ్ ఉసేనయ్య, మాజీ ఉప సర్పంచ్ నరేందర్ గౌడ్, మాజీ వార్డ్ సభ్యుడు గడ్డం నరహరి, వార్డ్ సభ్యులు పురేందర్ నాయుడు, సురేష్, భీముడు, పల్సర్ మద్ది లేటి, పెద్ద కురుమయ్య, పరశురాముడు, మల్లిపర్వస్ వర్కర్లు రామకృష్ణ, మూ సా, స్వాములు,ఉపాధ్యాయులు భరత్ కుమార్, పీటీ యాదవ్ పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో ఆంజనేయ స్వామి మహా యజ్ఞం

## – గాదిర్యాల్ ఆలయ వైభవానికి మాజీ ఎమ్మెల్యే కోప్పుల మహేష్ రెడ్డి ప్రశంసలు



**మహమ్మదాబాద్, మే 11 ( ప్రజా జ్యోతి ) :**
మహమ్మదాబాద్ మండలం గాదిర్యాల్ గ్రామంలోని హనుమాన్ దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న మహా యజ్ఞ కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. రెండవ రోజు సోమవారం నిర్వహించిన హనుమత్ హోమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ యజ్ఞ కార్యక్రమానికి పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. వేద పండితుల మంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ యజ్ఞ కార్యక్రమాలు ఆధ్యాత్మిక వాతావరణంలో సాగాయి.అనంతరం గ్రామంలోని వివిధ పార్టీల నాయకులు, మహిళలు, యువకులు, హనుమాన్ భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కోప్పుల మహేష్ రెడ్డి మాట్లాడుతూ, గాదిర్యాల్ గ్రామ ప్రజలు ఐక్యతతో ఎంతో పెద్ద స్థాయిలో దేవాలయాన్ని నిర్మించి నియోజకవర్గానికే ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు. ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాణిక్యమ్మ అనంతయ్య, ఉప సర్పంచ్ హనుమంతు గౌడ్, మాజీ సర్పంచ్ వెంకట్రామ్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ అంజనా చారి, మాజీ మరియు తాజా ప్రజాప్రతినిధులు, యువకులు, మహిళలు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

## మహిళల మీద అత్యాచారాలు హత్యలు చేసేవారిని కఠినంగా శిక్షించాలి

**పిడిఎస్యు జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి**



నారాయణపేట ప్రతినిధి మే 11 ప్రజా జ్యోతి దేశంలో రాష్ట్రంలో రోజురోజుకు మహిళలపై మైనర్లపై అత్యాచారాలు హత్యలు ఎక్కువవుతున్నాయని వాటిపట్ల ప్రభుత్వాలు కఠినంగా నిందితులకు శిక్షలు విధించాలని డిమాండ్ చేశారు ఆమె, కేంద్ర హోమ్ సహాయశాఖ మంత్రి బండి సంజయ్ కుమారుడు 17 సంవత్సరాల బాలికను మద్యం తాగించి అత్యాచారం చేయడానికి తీవ్రంగా ఖండించారు, ఒక ప్రజా ప్రతినిధి హోదాలో అందులో కేంద్ర మంత్రి అయి ఉండి తన కుమారుడు మీద ఇలాంటి తీవ్ర ఆరోపణలు వచ్చినప్పుడు వెంటనే స్పందించి పదవికి రాజీనామా చేసి నిజాలను సమాజానికి తెలిస్తే బాధ్యత తన మీద ఉందని ఆమె డిమాండ్ చేశారు, వెంటనే ప్రభుత్వ స్పందించి బాధ్యత కుటుంబానికి రక్షణ కల్పించి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని ఆమె డిమాండ్ చేశారు

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికకు ఎన్టీఆర్ కళాశాలలో శ్రీకారం

## – విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే డిజిటల్ సేవలు ప్రారంభించిన మేయర్ మమత



మహబూబ్నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : స్థానిక ఎన్టీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ అటానమస్ కళాశాలలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా విద్యావారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మార్చి 6 నుండి జూన్ 12 వరకు 99 రోజుల పాటు కొనసాగుతున్న ఈ కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి మే 17 వరకు విద్యాశాఖ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నగర మేయర్ మమత కళాశాలలో నిర్వహించిన కార్యక్రమానికి హాజరై కరపత్రాలు, ఫ్లెక్సీ బ్యానర్లను ఆవిష్కరించారు. అలాగే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా పరిశ్రమలు, కార్పొరేట్ ఆసుపత్రులతో కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (ఎంఓయూల) వివరాలను విడుదల చేశారు. విద్యార్థినులు పుస్తకాలు కొనుగోలు చేయకుండా డిజిటల్ విధానంలో ఈ-రీసోర్స్ లింకుల ద్వారా అవసరమైన పుస్తకాలను సులభంగా చదివే విధంగా ప్రత్యేక వ్యవస్థను రూపొందించినట్లు కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్ జహాన్ తెలిపారు. కళాశాలలో ఇప్పటికే డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉండటంతో విద్యార్థినులు, అధ్యాపకులు తమ జ్ఞానాన్ని, పరిశోధన సామర్థ్యాన్ని మరింత పెంపొందించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ డిజిటల్ లింకులను మేయర్ మమత ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మమత మాట్లాడుతూ, తెలంగాణ ప్రభుత్వం పరిపాలనా ప్రక్రియలను వేగవంతం చేయడం, పెండింగ్ సమస్యలను పరిష్కరించడం, విద్యాభివృద్ధికి పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. అందరూ సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక విజయవంతమవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మా అనురాధ, కార్పొరేటర్ ఒమర్ కొత్వాల్, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ ఎం. ప్రవీణ్ కుమార్, డాక్టర్ హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



# వరి కొనుగోలు కేంద్రాలలో అవకతవకాలు అరికట్టాలి

నారాయణపేట ప్రతినిధి మే 11 ప్రజా జ్యోతి

నారాయణపేట జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలలో జరుగుతున్న అవకతవకాలను అరికట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి వెంకట్రామిరెడ్డి ,రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్య గౌడ్ డిమాండ్ చేశారు . సోమవారం రోజు నారాయణపేట జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్కు దగ్గర సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.ఈ ధర్నాలో వారు మాట్లాడుతూ సరిపడా గన్నీ బ్యాగులు, సమయానికి లారీలు ఏర్పాటు చేయకపోవడం కారణంగా రైతులు తీవ్రంగా ఇబ్బందులు గురవుతున్నారని మండిపడ్డారు.చివరి గింజవరకు కొంటమంటున్నారు.కానీ చివరికి దళారుల చేతుల్లోకి రైతు వెళ్లేవిధంగా ప్రభుత్వం పరిస్థితులను కల్పిస్తున్నదన్నారు. కొనుగోలు కేంద్రాలపై అధికారుల పర్యవేక్షణ నిరంతరంగా ఉండాలన్నారు. ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో తూకం చేయడంతో పాటు మరో మారు రసమిల్లర్స్ కూడా తూకం వేసి రైతుల నుంచి మూడు నుంచి ఐదు కిలోల మేర ధాన్యమును తీసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు . తూకంలో అధికంగా మరియు తరుగు పేరా మరో కిలో నర చొప్పున తీస్తున్నారని అన్నారు .రైస్ మిల్లుల కనుసన్నల లో కొనుగోలు కేంద్రాలు నడుస్తున్నాయని



అనుమానం వ్యక్తం చేశారు .మరికల్ మండల కేంద్రంలో మక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం వివిధ డిమాండ్లతో కొడుకుల వినతిపత్రాన్ని కలెక్టర్ ప్రియాంక గారికి అందజేశారు .ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండమీది బలరాం నాయకులు గోవిందరాజ్,జోషి,కాశప్ప, దస్తప్ప, భీమ్ రాజ్, మల్లేష్, చుక్క గోవిందు గోటూరు, మల్లేష్, మజార్ సోఫీ తదితరులు పాల్గొన్నారు

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి

**- పెండింగ్ లేకుండా ప్రతి వినతిపై చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

**మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**

ప్రజావాణిలో ప్రజల నుండి అందిన ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ప్రతి దరఖాస్తును సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ హరిప్రియతో కలిసి అర్జీదారుల నుండి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అర్జీదారుల సమస్యలను సావధానంగా విని, ప్రతి సమస్యను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ప్రజావాణి కార్యక్రమం నుంచే వెబెక్స్ ద్వారా మహబూబ్‌నగర్ రూరల్, రాజాపూర్ మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలకు కలెక్టర్ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. భూ సర్వే, భూ ఆక్రమణలు, ఇందిరమ్మ ఇళ్లు తదితర అంశాలపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నందున క్షేత్రస్థాయిలో పర్యటించి విచారణ జరిపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. జిల్లా ప్రజావాణికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని, అలాగే డివిజన్ మరియు మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు సంబంధిత అధికారులు క్రమం తప్పకుండా హాజరుకావాలని ఆదేశించారు.ప్రజావాణిలో పంచాయతీరాజ్, మున్సిపల్, ఎక్సైజ్, భూ సర్వే రికార్డులు, గృహనిర్మాణం, సంక్షేమ శాఖలు, రోడ్డు రవాణా, బ్యాంకింగ్, పోలీస్, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి తదితర



శాఖలకు సంబంధించిన మొత్తం 114 వినతులను అధికారులు నమోదు చేసుకున్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ మాట్లాడుతూ, సీఎం ప్రజావాణి, కలెక్టర్ ప్రజావాణిలో పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ పెండింగ్ ఫైళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు. కోర్టు కేసులకు సంబంధించిన ఫైళ్ల విషయంలో జిల్లా న్యాయ శాఖ అధికారులతో సంప్రదించి వెంటనే కౌంటర్ దాఖలు చేయాలని, నిర్లక్ష్యం చేస్తే అధికారులు తీవ్రమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామ్‌రెడ్డి, జడ్పీ సీఈఓ, ఇంచార్జి డీపీఓ వెంకట్‌రెడ్డి, డీఆర్‌డీఓ నరసింహులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ ,పీఎం శ్రీవిద్యను అంగన్వాడీలకే అప్పజెప్పాలి

## జిల్లా కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన అంగన్వాడీలు .

**నారాయణపేట ప్రతినిధి మే ప్రజా జ్యోతి**

కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రీ ప్రైమరీ మరియు పి.ఎం శ్రీ విద్యను అంగన్వాడీలకి అప్పజెప్పాలని తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్( సిఐటియు) ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక గారికి వినతి సోమవారం రోజు వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షులు గోవిందరాజు ,సిఐటియు జిల్లా కార్యదర్శి బండమీది బలరాం, తెలంగాణ అంగన్వాడి టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు కవిత మాట్లాడారు.కాంగ్రెస్ ఎన్నికల మెనూపెస్టోలో పేర్కొన్న విధంగా అంగన్వాడీలకు కనీస వేతనం 18000 అమలు చేయాలని , ప్రస్తుతం ఇస్తున్న వేతనం ప్రతినెలా ఒకటో తారీకున తప్పనిసరిగా అందజేయాలని కోరారు.ఏప్రిల్ నెల వేతనం నేటికి కూడా అందలేదని తెలిపారు .నాసిరకమైన సెల్ ఫోనులు అందజేశారని వీటిని వెంటనే వెనక తీసుకుని 5జి నెట్వర్క్ తో కూడుకున్న నూతనంగా సెల్ఫోన్లో అందజేయాలని కోరారు. అంగన్వాడీల ఉనికికే ప్రమాదంగా మారిన నూతన విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని కోరారు. కేంద్ర శిశు సంక్షేమ శాఖ ఆదేశాల ప్రకారం అంగన్వాడిలకు బిఎల్ఓ డ్యూటీలను వెంటనే రద్దు చేయాలని అంగన్వాడీలకు అదనపు పనులను అప్పజెప్పొద్దని కోరారు.సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి తెలంగాణ రాష్ట్రంలో కూడా అంగన్వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడుకున్న వినతిపత్రం కలెక్టర్ ప్రియాంక గారికి అందజేశారు. ఈ కార్యక్రమం ఈ కార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ నాయకులు పద్మా సుజాత జ్యోతిష్య అమృత సదా లక్ష్మీ వి సురేఖ జయ శ్రీ నిర్మల శాంతా గోవిందమ్మ కృష్ణవేణి జయసుధ అనురాధ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు



# వడదెబ్బ నివారణకు విస్తృత అవగాహన

**- ఉపాధి హామీ కూలీలకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్ల పంపిణీ**

**-- జిల్లా వైద్య ఆరోగ్య శాఖ**



**మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**


"ప్రజా పాలనా – ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా వడదెబ్బ నివారణ చర్యలు చేపట్టారు. ప్రజలకు, ముఖ్యంగా ఉపాధి హామీ పథకం కూలీలకు వడదెబ్బ బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా 221 మంది ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ నివారణపై సూచనలు అందజేసి, 2224 ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.అదేవిధంగా క్షయ నిర్ధారణ కార్యక్రమంలో భాగంగా నవాబ్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పోమాల్, రుద్రారం గ్రామాల్లో ప్రత్యేక ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. ఈ శిబిరాల్లో 158 మందికి ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించగా, 20 మందికి తెమడ పరీక్షలు చేశారు. దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నివారణ చర్యల్లో భాగంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. మొత్తం 660 గృహాలను పరిశీలించగా, 25 గృహాల్లో నీటి నిల్వల్లో దోమల లార్వాను గుర్తించి నిర్మూలన చర్యలు చేపట్టారు.అలాగే జ్వరంతో బాధపడుతున్న 26 మందిని గుర్తించి రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన చికిత్స అందించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు.

# కస్తూర్బా పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరం ప్రారంభం

**- విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

**పెబ్బేరు, మే 11 (ప్రజాజ్యోతి):**

పెబ్బేరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా తరగతులను సోమవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శిబిరంలో క్రీడలు, నృత్యాలు, ఆంగ్లం, గణితం, చిత్రలేఖనం, కరాటే తదితర అంశాల్లో శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు శ్రద్ధతో పాల్గొని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. వేసవి సెలవుల నేపథ్యంలో జిల్లాలోని 15 కస్తూర్బా గాంధీ పాఠశాలల అధ్యాపకులు రోజువారీ విధుల ప్రకారం శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శిక్షణ పొందేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి ప్రభుత్వంలోని వివిధ శాఖల్లో ఉద్యోగాలు సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. కార్యక్రమంలో జీసీడీఓ ఇందిరాదేవి, పాఠశాల ప్రత్యేక అధికారి, అధ్యాపకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# బీఆర్ఎస్ హయాంలో జడ్చర్లలో భూకబ్జాలు, అవినీతి రాజ్యం

## – అభివృద్ధి కోసం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి అహర్నిశలు శ్రమిస్తున్నారని కాంగ్రెస్ నేతల ప్రశంస

**జడ్చర్ల, మే 11 ( ప్రజా జ్యోతి ) :**
జడ్చర్ల నియోజకవర్గంలో గత బీఆర్ఎస్ పాలనలో అవినీతి, భూకబ్జాలు, అక్రమాలు విపరీతంగా జరిగాయని కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్ర స్థాయిలో విమర్శించారు. సోమవారం జడ్చర్ల మున్సిపాలిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. గత పది సంవత్సరాల బీఆర్ఎస్ పాలనలో జడ్చర్ల అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. ముఖ్యంగా మున్సిపాలిటీలో డ్రైనేజీ వ్యవస్థను పూర్తి చేయకుండా నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. మాజీ ఎమ్మెల్యే మరియు ఆయన అనుచరులు కలిసి నియోజకవర్గంలో విచ్చలవిడిగా భూకబ్జాలు, భూ దందాలు నిర్వహించి పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. మాజీ ఎమ్మెల్యే చేసిన అక్రమాల కారణంగానే మార్కెట్‌కు చెందిన యాదగిరి అనే వ్యక్తి సస్పెండ్ అయ్యాడని పేర్కొన్నారు. గత ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రిని కలిసి నియోజకవర్గ అభివృద్ధి పనులకంటే రెండు పోలీస్ స్టేషన్లు కావాలని అడిగిన అసమర్థ మాజీ ఎమ్మెల్యే అని విమర్శించారు. ప్రజల సమస్యలపై దృష్టి పెట్టకుండా స్వార్థ రాజకీయాలకు మాత్రమే పరిమితమయ్యారని ఆరోపించారు.ప్రస్తుతం ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి జడ్చర్ల నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారని కొనియాడారు. మున్సిపాలిటీలో రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాలు, ఇతర ప్రజా సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలు



వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అదేవిధంగా జడ్చర్ల నియోజకవర్గానికి ట్రిపుల్ ఐటీ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల, నవోదయ విద్యాలయాలను మంజూరు చేయించడం ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి కృషికి నిదర్శనమని ప్రశంసించారు. విద్యారంగ అభివృద్ధికి ఆయన ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పై బీఆర్ఎస్ నాయకులు అసత్య ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన కాంగ్రెస్ నేతలు, రాబోయే రోజుల్లో మాజీ ఎమ్మెల్యే మరియు బీఆర్ఎస్ నాయకులు చేసిన అవినీతి, అక్రమాల బండారాన్ని ప్రజల ముందుంచుతామని స్పష్టం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని, జడ్చర్ల ప్రజలు కూడా అభివృద్ధికి సహకరించాలని కోరారు.కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# 13 నుంచి ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు



**గద్వాల మే 11(ప్రజా జ్యోతి):**
ఈనెల 13వ తేదీ నుంచి 19వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పబ్లిక్ అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు,ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నా 2: 30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.పరీక్షలు రాసే విద్యార్థులు హాల్ టికెట్ లోని నియమ,నిబంధనలను క్షుణ్ణంగా చదువుకొని వాటి ప్రకారం పరీక్షలు రాసేందుకు సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు.

# ఈవీఎం గోదాం భద్రతపై కలెక్టర్ ప్రత్యేక తనిఖీ

## – ఎన్నికల సామగ్రి రక్షణలో నిర్లక్ష్యం ఉండొద్దు : ఖుష్బూ గుప్తా

**మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**
భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న నెలవారీ తనిఖీలలో భాగంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఉన్న ఈవీఎం గోదాంను పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాం భద్రతా ఏర్పాట్లు, సీల్స్‌ను కలెక్టర్ స్వయంగా తనిఖీ చేశారు. ఎన్నికల సామగ్రి భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకూడదని, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సక్రమంగా కొనసాగేందుకు ఈవీఎంల భద్రత అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ రామ్‌రెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ జాఫర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



# పోక్సో కేసులో బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలి

## – బండి సంజయ్ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ డిమాండ్



జడ్చర్ల, మే 11 ( ప్రజా జ్యోతి ) : కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ఇప్పటివరకు ఎలాంటి అరెస్ట్ జరగకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోందని మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ డా. కొడుగల్ యాదయ్య ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదై మూడు రోజులు గడిచినా నిందితుడిపై పోలీసులు చర్యలు తీసుకోకపోవడం అధికార దుర్వినియోగానికి నిదర్శనమని ఆయన మండిపడ్డారు. పేద ప్రజలకు ఒక న్యాయం, అధికారంలో ఉన్న వారికి మరో న్యాయమా అని ప్రశ్నించారు. బాధిత కుటుంబం మూడు నెలలుగా న్యాయం కోసం తిరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. బాధిత కుటుంబాన్ని భయభ్రాంతులకు గురి చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ, వారికి తక్షణ రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు.ఈ ఘటనపై హోం మంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి నిష్పక్షపాత విచారణ జరిపించాలని కోరారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ నైతిక బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.అలాగే భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ స్థానిక ఎంఆర్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పిట్టల మురళి, రఘుపతిరెడ్డి, ఇంతియాజ్ ఖాన్, దేవా, సతీష్, ఉమాశంకర్ గౌడ్, లతా, మహేష్, ఈటె శ్రీను, కరాటే శ్రీను, బీఆర్ఎస్వీ నాయకులు బాలు, సోహెల్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యా వారోత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

## – జిల్లా కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి

మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) : పాలమూరు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ సోమవారం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తాను కలెక్టర్ ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయంలో మే 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల బ్రోచర్‌ను జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఉపకులపతి ప్రొఫెసర్ జి.ఎన్. శ్రీనివాస్ కలిసి ఆవిష్కరించారు. విద్యా వారోత్సవాల్లో భాగంగా ఈ నెల 15న పాలమూరు విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిర కార్యక్రమాలకు హాజరుకావాలని కలెక్టర్‌ను ఉపకులపతి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పాలమూరు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి. రమేష్ బాబు, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ కె. ప్రవీణ్, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎన్. చంద్రకిరణ్, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపల్ ౘ ఐక్యూఏసీ డైరెక్టర్ డాక్టర్ డి. మధుసూదన్ రెడ్డి, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ నాగం కుమార్ స్వామి, న్యాయ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జె. మాళవి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిహెచ్. రవికాంత్, కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ. కరుణాకర్ రెడ్డి, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ వి. భూమయ్య, పీఆర్వో డాక్టర్ ఎం. గాలెన్న తదితరులు పాల్గొన్నారు.



# వడ్డేపల్లి నూతన ఇంచార్జ్ కమిషనర్ గాచంద్రశేఖర రావు బాధ్యతలు స్వీకరణ

**వడ్డేపల్లి మే11( ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి మున్సిపాలిటీ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్.రాజయ్య ప్రభుత్వ పరిపాలనా బదిలీలలో భాగంగా మక్తల్ మున్సిపాలిటీకి బదిలీ కావడంతో సోమవారం వడ్డేపల్లి మున్సిపాలిటీ కార్యాలయంలో అధికారికంగా విధుల నుండి రిలీవ్ అయ్యారు.ఈ సందర్భంగా మున్సిపాలిటీ సిబ్బంది అధికారులు ఎస్.రాజయ్య సేవలను కొనియాడుతూ వడ్డేపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి ఆయన చేసిన కృషిని ప్రశంసించారు.అలాగే సన్మానం చేశారు.తన పదవీ కాలంలో పట్టణ పారిశుధ్యం,మౌలిక వసతుల అభివృద్ధి,ప్రజా సమస్యల పరిష్కారం, పాలనలో పారదర్శకతకు ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించారని పేర్కొన్నారు.అదే రోజు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు పి.చంద్ర శేఖర్ రావు వడ్డేపల్లి మున్సిపాలిటీకి నూతన ఇంచార్జ్ కమిషనర్‌గా పదవి బాధ్యతలు స్వీకరించారు.మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన బాధ్యతల అప్పగింత కార్యక్రమంలో అధికారులు సిబ్బంది సమక్షంలో ఆయన అధికారికంగా బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా నూతన ఇంచార్జ్ కమిషనర్ పి.చంద్ర శేఖర్ రావు మాట్లాడుతూ,వడ్డేపల్లి పట్టణ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తానని ప్రజలకు మెరుగైన మున్సిపల్ సేవలు అందించేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో వేగవంతమైన చర్యలు తీసుకుంటూ,పారిశుధ్యం,తాగునీటి సరఫరా, పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ అధికారులు,కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

**- 15 రోజుల్లో 90 శాతం పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి ఆదేశం**




**మహబూబ్‌నగర్, మే 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :** ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) ప్రక్రియలో భాగంగా తాజా ఓటరు జాబితాను ఎస్.ఐ.ఆర్ జాబితాతో మ్యాపింగ్ చేసే ప్రక్రియను వేగవంతం చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి నిర్వహించిన ఓటరు జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి మహబూబ్‌నగర్ జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో రాబోయే 15 రోజుల్లో కనీసం 90 శాతం మ్యాపింగ్ పూర్తి చేయాలని సూచించారు. స్టేషన్ ఘన్‌పూర్, అశ్వారావుపేట నియోజకవర్గాలు ఇప్పటికే 80 శాతానికి పైగా మ్యాపింగ్ పూర్తి చేశాయని తెలిపారు. ఒడిశా రాష్ట్రం 90 శాతం, కర్ణాటక 81 శాతం, మహారాష్ట్ర 68 శాతం మ్యాపింగ్ పూర్తి చేశాయని, తెలంగాణ ఇంకా వెనుకబడి ఉందని పేర్కొన్నారు. జిల్లా ఎన్నికల అధికారులు తమ బృందాలను ప్రోత్సహించి మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల పాత్ర కేవలం ఇళ్ల గుర్తింపు, వ్యక్తుల గుర్తింపుకు మాత్రమే పరిమితం కావాలని స్పష్టం చేశారు. ప్రైవేట్ వ్యక్తులు ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ నిర్వహిస్తున్నారనే భావన ప్రజల్లో కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ కోసం అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను అన్ని వనరుల నుంచి గుర్తించి నియమించుకోవాలని తెలిపారు. ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ప్రతిరోజూ ఫారాల పంపిణీ, సేకరణపై సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్‌ఓ ఎవరో తెలిసేలా చర్యలు తీసుకోవాలని, నిజమైన ఓటరు తన ఓటు హక్కు కోల్పోకుండా చూడాలని ఆదేశించారు. అలాగే మ్యాపింగ్ పురోగతిని పెంచేందుకు రాజకీయ పార్టీలతో సమావేశాలు నిర్వహించాలని, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారాన్ని వినియోగించుకోవాలని సూచించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ, జిల్లాలో ఎస్.ఐ.ఆర్ మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర నియోజకవర్గాల్లో మ్యాపింగ్ వేగంగా కొనసాగుతోందని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ అర్బన్‌లో 62 శాతం, జడ్చర్లలో 75 శాతం, దేవరకద్రలో 78 శాతం ఎస్.ఐ.ఆర్ పూర్తి చేశామని తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు సగటున 71 శాతం మ్యాపింగ్ పూర్తయ్యిందని, రాబోయే 15 రోజుల్లో దీనిని 90 శాతానికి చేరుకునేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. బీఎల్‌ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.అవసరమైన డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమిస్తూ, రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకుంటూ పారదర్శకంగా ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రతి ఓటరు పేరు సక్రమంగా మ్యాపింగ్ అయ్యేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి హరిప్రియ, ఆర్డీఓ నవీన్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# స్వయం ఉపాధి పథకాల లబ్ధిదారులు ఇంటర్వ్యూలకు హాజరు కావాలి

**- అవసరమైన ధ్రువపత్రాలతో బ్యాంకులకు రావాలని అధికారుల సూచన**

**మహమ్మదాబాద్, మే 11 ( ప్రజా జ్యోతి ) :** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 2025-26 సంవత్సరానికి స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఈ నెల 13న నిర్వహించే వ్యక్తిగత ఇంటర్వ్యూలకు తప్పనిసరిగా హాజరు కావాలని అధికారులు సూచించారు.మహమ్మదాబాద్ మండలంలోని వివిధ గ్రామపంచాయతీలకు చెందిన లబ్ధిదారులు ఆన్‌లైన్ దరఖాస్తు కాపీలతో పాటు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, రేషన్ కార్డు, విద్యార్హత ధ్రువపత్రాల రెండు జతలను తీసుకురావాలని తెలిపారు. రవాణా రంగ యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న వారు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ సమర్పించాలని పేర్కొన్నారు. లబ్ధిదారులు మహమ్మదాబాద్ స్టేట్ బ్యాంక్ మరియు నంచర్ల స్టేట్ బ్యాంక్‌లలో ఉదయం 11:30 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకావాలని అధికారులు వెల్లడించారు.

# జడ్చర్లలో ఉత్సాహంగా సిఎల్ఆర్ క్రికెట్ సెమీఫైనల్స్

**- టాస్ వేసి పోటీలను ప్రారంభించిన మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య**



**జడ్చర్ల, మే 11 ( ప్రజా జ్యోతి ) :** జడ్చర్ల పట్టణ కేంద్రంలో నిర్వహిస్తున్న సిఎల్ఆర్ చాంపియన్ షిప్ క్రికెట్ టోర్నమెంట్ సెమీఫైనల్ పోటీలు ఆదివారం ఉత్సాహంగా కొనసాగాయి. ఇందిరా నగర్ కాలనీ జట్టు, వేమూల గ్రామ జట్ల మధ్య జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌ను మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కోడుగల్ యాదయ్య టాస్ వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన క్రీడాకారులతో పరిచయం చేసుకొని యువత క్రీడలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐక్యత, ఆరోగ్య చైతన్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీడల ద్వారా శారీరక, మానసిక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ అధ్యక్షులు పిట్టల మురళి, ఇమ్ము, కరాటే శ్రీను, శశికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# జాగృతి పథకం-2025లో భాగంగా బాలల హక్కులపై అవగాహన కార్యక్రమం




**గద్వాల మే 11(ప్రజా జ్యోతి):** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాగృతి పథకం--2025 కింద "సురక్షిత్ బచ్పన్,సురక్షిత్ భవిష్య"అవగాహన కార్యక్రమం గద్వాల మండలం వీరాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమంలో పోక్సో చట్టం పై గ్రామ ప్రజలకు,తల్లిదండ్రులకు, యువతకు,చిన్నారుల సంరక్షణకు సంబంధించిన ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి.రాజేందర్, బి.శ్రీనివాసులు,డి.లక్ష్మణ స్వామి మాట్లాడుతూ,చిన్నారులపై జరిగే లైంగిక దాడులు, వేధింపులు,బాలల హక్కుల ఉల్లంఘనలను అరికట్టేందుకు పోక్సో చట్టం కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు.పిల్లలపై ఎలాంటి అనుమానాస్పద ప్రవర్తన కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.పిల్లలకు సురక్షిత వాతావరణం కల్పించడం తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు,సమాజం యొక్క సమిష్టి బాధ్యత అని పేర్కొన్నారు.అదేవిధంగా చిన్నారులకు మంచి స్పర్శ-చెడు స్పర్శ గురించి తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని,పిల్లలు భయపడకుండా తమ సమస్యలను కుటుంబ సభ్యులతో పంచుకునేలా ప్రోత్సహించాలని తెలిపారు.పోక్సో చట్టం కింద నేరస్తులకు కఠినమైన శిక్షలు విధించబడతాయని వివరించారు.కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి ఈ.రోజారాణి మాట్లాడుతూ,గ్రామ స్థాయిలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,గ్రామ పెద్దలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని పోక్సో చట్టం,బాలల హక్కులు,చట్టపరమైన రక్షణపై అవగాహన పొందారు. కార్యక్రమం ద్వారా చిన్నారుల రక్షణ,విద్య,భద్రమైన భవిష్యత్తు నిర్మాణం కోసం సమాజం అప్రమత్తంగా ఉండాలనే సందేశం అందించబడింది.

# సింగిల్ విండో చైర్మన్‌గా బగ్గారి నరసింహారెడ్డి బాధ్యతలు

**చిన్నంబావి మే 11 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని కొప్పునూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సింగిల్ విండో చైర్మన్ గా బగ్గారి నరసింహా రెడ్డి మరోసారి బాధ్యతలు చేపట్టారు సోమవారం సింగిల్ విండో కార్యాలయంలో సీఈఓ నాగరాజు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుని ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నూతన పాలకవర్గాల ఎంపిక చేపట్టే వరకు పాత పాలకవర్గాలే కొనసాగించాలని హైకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో సోమవారం ఉదయం పది గంటలకు సింగిల్ విండో కార్యాలయంలో ఆయన చైర్మన్ గా బాధ్యతలు చేపడుతున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బగ్గారి నరసింహ రెడ్డి మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి. సహకార వ్యవస్థ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. గత కాల పరిమితిలో రైతుల భాగ్య సామ్యంతో ప్యాక్స్ చేసిన అభివృద్ధిని కొనసాగిస్తూ. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవడానికి పాలకవర్గ సభ్యులందరి సహకారంతో ముందుకెళ్తామని పేర్కొన్నారు. బాధ్యతల చేపట్టారు ఈ కార్యక్రమంలో మండల రైతులు తదితరులు పాల్గొన్నారు



# ఎంపీడీఓ కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



నాగర్ కర్నూల్ : మే 11 (ప్రజా జ్యోతి) తిమ్మాజిపేట మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎంపీడీఓ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే కూచుకుళ్ల రాజేష్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల్ ప్రెసిడెంట్ వివేక్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి,హర్ష వర్ధన్,లక్ష్మి నారాయణ, పాల్గొన్నారు.



# శాంతినగర్ జెడ్పీహెచ్ఎస్‌లో సమ్మర్ క్యాంప్--2026 ఘన ప్రారంభం

**వడ్డేపల్లి మే 11(ప్రజా జ్యోతి):**
వడ్డేపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల ధర్మ,కౌన్సిలర్ విజయ్ భాస్కర్ సమక్షంలో సోమవారం శాంతినగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సమ్మర్ క్యాంప్--2026 ఘనంగా ప్రారంభమైంది.విద్యార్థులు,తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు, సిబ్బంది ఉత్సాహభరితంగా పాల్గొనడంతో ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది.దీప ప్రజ్వలనతో సమ్మర్ క్యాంప్‌ను అధికారికంగా ప్రారంభించారు. విద్యార్థులు పుష్పగుచ్ఛాలు అందించి,సాంస్కృతిక కార్యక్రమాలతో అతిథులకు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మంజుల ధర్మ మాట్లాడుతూ, విద్యార్థులు తమ సృజనాత్మకత, భావప్రకటన నైపుణ్యాలు,ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.అభ్యాసం,వినోదాన్ని సమన్వయం చేస్తూ కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులను అభినందించారు.కౌన్సిలర్ విజయ్ భాస్కర్ మాట్లాడుతూ,పాఠ్యేతర కార్యకలాపాల ప్రాముఖ్యతను వివరించారు.వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని విద్యార్థులను ప్రోత్సహించారు.సమ్మర్ క్యాంప్‌లో కళలు,చేతిపనులు,నృత్యం, సంగీతం,క్రీడలు,వ్యక్తిత్వ వికాస తరగతులు,కథల




చెప్పడం,సరదా పోటీలు తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.విద్యార్థుల సంపూర్ణ వికాసాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ కార్యక్రమాలను రూపొందించినట్లు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు,పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడిని వెంటనే అరెస్ట్ చేయాలి

**-సాయి భగీరథ్ పై కేసు నమోదై 60 గంటలైనా అరెస్టు చేయరా**
**-బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలి**
**-బీఆర్ఎస్ నాయకులు బైకానీ శ్రీనివాస్ యాదవ్**

**నాగర్ కర్నూల్ : మే 11 (ప్రజా జ్యోతి)**
కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు దృష్ట్యా నైతిక బాధ్యత వహించి మంత్రి బండి సంజయ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బైకానీ శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు.కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయిభగీరథ్ ను అరెస్టు చేయాలనిఅయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మైనర్ బాలికపై అత్యాచారం వేధింపుల కేసులో సాయి భగీరథ పై ఫోక్సో కేసు నమోదై 60 గంటలైనా ఎందుకు అరెస్టు చేయడం లేదని బైకాని శ్రీనివాస్ యాదవ్ ప్రశ్నించారు.కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్ తన హోదాను ఉపయోగించి తనకుమారుడిని కాపాడుకునే యత్నంలో ఉన్నాడని అందుకే వెంటనే బండి సంజయ్ కేంద్ర మంత్రికి రాజీనామా చేయాలి లేదంటే పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు.ఒకవైపుబి జె పి నాయకులు బేటి బచావో-బేటి పడావో అని నినాదం చేస్తూ,రాష్ట్రం మహిళా సాధికారత గురించి మాట్లాడుతారని ఈ రెండు నినాదాలుఎక్కడికి పోయాయని ప్రశ్నించారు.రాష్ట్ర హోం శాఖ మంత్రిగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డి వెంటనే సాయి భగీరథను అరెస్టు చేయించి మహిళలపై ఉన్న చిత్తశుద్ధి నిరూపించుకోవాలని లేనిపక్షంలోబిఆర్ఎస్ పార్టీ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన బుద్ధి చెబుతుందని బైకాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు.




# తరుగు లేకుండా ధాన్యం కొనాలి
## రాచాల యుగంధర్ గౌడ్

**"ఒక్క గింజ కూడా కొనలేదు.. అధికారులు పూర్తిగా విఫలం"**
**ఐకేపీ కేంద్రాన్ని సందర్శించిన బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్**

**చిన్నంబావి, మే 11 (ప్రజా జ్యోతి)**
చిన్నంబావి మండల పరిధిలోని వెలగొండ గ్రామంలో రైతుల ఆవేదన మిన్నంటుతోంది. నెలరోజుల క్రితమే ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు వరి ధాన్యాన్ని తీసుకొచ్చిన రైతులు ఇప్పటికీ కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండలు, అకాల వర్షాల మధ్య ధాన్యం రాశుల వద్దే రాత్రింబవళ్లు కాపలా కాస్తూ రైతులు పడుతున్న కష్టాలు అధికార యంత్రాంగ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయి.ఈ నేపథ్యంలో సోమవారం వెలగొండ గ్రామంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ రాచాల యుగంధర్ గౌడ్ సందర్శించారు. రైతులతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుల పరిస్థితిని పరిశీలించిన అనంతరం ఆయన ప్రభుత్వ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే వేల ఎకరాల్లో వరి సాగు జరుగుతున్న గ్రామంగా వెలగొండకు ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్న ఆయన, రైతులు నెలరోజులుగా ధాన్యాన్ని రాశులుగా పోసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నా ఇప్పటివరకు ఒక్క గింజ కూడా కొనుగోలు చేయకపోవడం దారుణమన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కూడా లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇక రైస్ మిల్లర్లు తరుగు పేరుతో రైతులను దోచుకుంటున్నారని ఆరోపించారు. ఒక్కో క్వింటాలుకు ఐదు కిలోల వరకు తరుగు తీస్తామని మిల్లర్లు బహిరంగంగానే చెబుతున్నా అధికారులు స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు. రైతుల శ్రమను దోచుకునే మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకొని, అవసరమైతే మిల్లులను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు."రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఇలాకాలోనే రైతుల పరిస్థితి ఇంత దయనీయంగా ఉంటే జిల్లాలో మిగతా ప్రాంతాల పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు" అని ఆయన వ్యాఖ్యానించారు. జిల్లాలో సివిల్ సప్లయ్ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని, ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు కనిపించలేదన్నారు.ధాన్యం రవాణా కోసం ప్రతి సెక్టార్‌కు 40 వాహనాల చొప్పున మొత్తం 360 వాహనాలు ఉన్నట్లు చూపించి కాంట్రాక్టర్లు టెండర్లు పొందారని, ప్రస్తుతం ఆ వాహనాలు ఎక్కడున్నాయో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ జీపీఎస్ ట్రాకింగ్ ఆధారంగా వాహనాల వివరాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు.కొనుగోలు కేంద్రాల్లో తూర్పు పట్టే యంత్రాలు లేకపోవడం, లోడింగ్ వాహనాలు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో రైతులను మరింత ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. వెంటనే తరుగు లేకుండా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.అదేవిధంగా గత రెండేళ్లుగా ఐకేపీ కేంద్రాన్ని నిర్వహిస్తున్న సభ్యుల పేర్లపై అకౌంట్లు లేకపోవడం వల్ల పని చేసే వారికి ప్రయోజనం దక్కడం లేదని తెలిపారు. వెంటనే సంబంధిత సభ్యుల పేర్లపైనే అకౌంట్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శరత్ రెడ్డి, మాజీ సర్పంచ్ గుట్టలయ్య, బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి వివి గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ యశ్వంత్, నాయకులు రామన్ గౌడ్, పెద్ద బొడ్డయ్య, వెంకటస్వామి గౌడ్, అశోక్, సుదర్శన్ రెడ్డి, నాగరాజు, శివారెడ్డి, రవీందర్ రెడ్డి, పరమేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి మిషన్ భగీరథ నీటి సరఫరా మెరుగు పరచాలి

**జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక.**



**నారాయణపేట ప్రతినిధి**
**మే 11 ప్రజా జ్యోతి**
జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి/మెడికల్ కళాశాలలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం మిషన్ భగీరథ నీటి సరఫరా ను మరింత పెంచి ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్, హెచ్ఓడీ లతో మెడికల్ కాలేజీ/ జిల్లా ఆస్పతి నీటి సమస్యపై కలెక్టర్ చర్చించారు. ప్రస్తుతం ఆస్పత్రికి చేస్తున్న నీటి సరఫరాతో పాటు అదనంగా పెంచి సరఫరా చేయాలని కలెక్టర్ మిషన్ భగీరథ గ్రిడ్ ఈ.ఈ శ్రీనివాస్ కు సూచించారు. నాలుగైదు రోజులలో ఆస్పత్రికి అదనంగా నీటిని సరఫరా చేస్తామని ఈ ఈ రంగారావు కలెక్టర్ కు తెలిపారు. మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ సంపత్ కుమార్, జిల్లా ఆస్పత్రి హెచ్ఓడీ శ్రీనివాసులు పాల్గొన్నారు.

# కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఇబ్బంది రావద్దు

**తహసిల్దారు ఝాన్సీరాణి**



**మల్దకల్ మే 11(ప్రజా జ్యోతి):**
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మల్దకల్ మండల కేంద్రంలోని మొక్కజొన్న,బిజ్వారం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని తాసిల్దార్ ఝాన్సీరాణి నిర్వాహకులకు ఆదేశించారు.సోమవారం మల్దకల్ మండల కేంద్రంలోని మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని,బిజ్వారంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తాసిల్దార్ తనిఖీ చేశారు.రైతులకు త్రాగునీరు అన్ని సదుపాయాలు కల్పించి వచ్చిన సరుకులను రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.ప్రస్తుత అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బంది పడకుండా ధాన్యాన్ని భద్రపరచుకొని కేంద్రాలకు తరలించాలని రైతులకు సూచించారు.ఈమె వెంట జిపిఓ తదితరులు ఉన్నారు.

# వెన్నచేడ్‌లో సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహణ

గండిడ్ మే 11 (ప్రజా జ్యోతి) వెన్న చెడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల.ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మర్ క్యాంప్ ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. గ్రామ సర్పంచ్ గుర్రాల నవనీత చెన్నయ్య, ముఖ్య అతిథిగా హాజరైన మండల ఎమ్మార్వో కలిసి కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. విద్యార్థులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని వారు ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా మాట్లాడుతూ, సమ్మర్ క్యాంప్ ద్వారా విద్యార్థుల్లో ప్రతిభ, నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు. నేటి కాలంలో కంప్యూటర్ విద్యకు ఎంతో ప్రాధాన్యత ఉందని, ఈ ల్యాబ్ విద్యార్థులకు ఉపయోగకరంగా మారాలని ఆశాభావం వ్యక్తం చేశారు.
కార్యక్రమంలో స్కూల్ హెడ్‌మాస్టర్ రవిబాబు, నలంద స్కూల్ హెడ్‌మాస్టర్ మాసయ్య, పిఎసిఎస్ మాజీ చైర్మన్ రామ్ రెడ్డి, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.



# మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన బండి భగీరథ్ సాయిపై సిట్ విచారణ జరపాలి

**నారాయణపేట, ప్రతినిధి మే 11 (ప్రజా జ్యోతి)**

నారాయణపేటలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నారాయణపేట మాజీ ఎమ్మెల్యే శ్రీ ఎస్. రాజేంద్ర రెడ్డి మాట్లాడుతూ, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కుమారుడి అరెస్టుపై సిట్ చేత విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు .సోషల్ మీడియాలో చిన్న చిన్న పోస్టులకే తక్షణమే అరెస్టులు చేసే పోలీసు యంత్రాంగం ఈ విషయంలో ఎందుకు మౌనంగా ఉందని ఆయన ఈ సందర్భంగా ఆరోపించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినప్పటికీ, నిందితుడిని ఇంకా అరెస్టు చేయకపోవడం ప్రశ్నార్థకంగా ఉందని ఆయన అన్నారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ నైతిక బాధ్యత స్వీకరించి తన పదవికి రాజీనామా చేయాలని, లేకపోతే నరేంద్ర మోదీని తన మంత్రివర్గం నుండి ఆయనను తొలగించమని కోరాలని ఆయన డిమాండ్ చేశారు.బాధితురాలు మైనర్ అని తెలిసినప్పటికీ, బండి సంజయ్ కుమారుడైన బండి సాయి భగీరథ్ ఒక మైనర్ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడని ఎస్. రాజేంద్ర రెడ్డి అన్నారు.నిందితులను అరెస్టు చేయకుండా, పోలీసులు బాధితుల కుటుంబంపై కేసులు నమోదు చేశారని ఆయన ఆరోపించారు.అసలు అనుమానితుడు దేశంలోనే ఉన్నాడా లేదా విదేశాలకు పారిపోయాడా అనే దానిపై వారు సందేహాలు వ్యక్తం చేశారు.8వ తేదీన ఫిర్యాదు దాఖలు చేసినప్పటికీ, చాలా రోజుల వరకు ఎలాంటి చర్య తీసుకోలేదని ఆయన అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హైదరాబాద్ పర్యటన తర్వాత మూడు రోజులు ఆలస్యంగా



పోక్సో కేసు నమోదైంది. బాధితురాలి కుటుంబానికి ఇప్పటివరకు ఎఫ్ఐఆర్ కాపీ కూడా అందించలేదు.కొందరు బీజేపీ నాయకులు బాధితురాలి కుటుంబాన్ని బెదిరిస్తున్నారని ఆయన ఇంకా ఆరోపించారు.బాధితురాలి కుటుంబాన్ని బెదిరించినందుకు, సాక్ష్యాలను ప్రభావితం చేయడానికి ప్రయత్నించినందుకు బిందీ సంజయ్, మధ్యవర్తి సంగప్పలను ఈ కేసులో నిందితులుగా చేర్చాలని ఎస్. రాజేంద్ర రెడ్డి డిమాండ్ చేశారు.పోక్సో కేసులో నిందితుడైన బండి సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేసి, బాధితురాలైన బాలికకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు

# ఆశాలకు ప్రతినెల 1వ తారీఖున పారితోషికం చెల్లించాలి

### కనీస వేతనం 18 వేల రూపాయలు అమలు చేయాలి

**నారాయణపేట ప్రతినిధి మే 11 (ప్రజా జ్యోతి)**

ఆశాలకు ప్రతినెల మొదటి తారీకు నాడు పారితోషికాలు తప్పనిసరిగా చెల్లించాలని పెండింగ్ ఉన్న ఏప్రిల్ నెల పారితోషికం వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు గోవిందరాజ్ జిల్లా కార్యదర్శి బండమీద బలరాం, ఆశ యూనియన్ జిల్లా అధ్యక్షులు బాలమణి ,జిల్లా కార్యదర్శి అనురాధ డిమాండ్ చేశారు .సోమవారం రోజు ఆశా యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీమతి ప్రియాంక గారికి వినతిపత్రం అందజేశారు .కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా కనీస వేతనం 18000 రూపాయలు అమలు చేయాలని, కేంద్ర ప్రభుత్వం పెంచిన 1500 రూపాయలు వెంటనే విడుదల అమలు చేయాలని కలెక్టర్ గారికి కోరారు.2021 జూలై నుంచి డిసెంబర్ వరకు పిఆర్సి బకాయలు వెంటనే చెల్లించాలని పెండింగ్లో ఉన్నప్పుడే పల్స్ పోలియో ఎగ్జామ్ డ్యూటీల బిల్లులను వెంటనే చెల్లించాలని .గతంలో ఇచ్చిన హామీ మేరకు 50 లక్షల ఇన్సూరెన్స్, 50వేలా మంటి ఖర్చు అమలు చేయాలన్నారు పీఎఫ్ ఈఎస్ఐ ఉద్యోగ భద్రత వంటి చట్టబద్ధం అసౌకర్యాలు కల్పించాలన్నారు. ఏఎన్ఎం, జిఎన్ఎమ్ ట్రైనింగ్ పూర్తి చేసిన ఆశా కార్యకర్తలకు ప్రమోషన్ కల్పించాలని కోరారు .ఈ వినతి పత్రం అందజేసిన



వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జోషి .ఆశ యూనియన్ జిల్లా నాయకులు మాట్లాడారు.ఈ వినతి పత్రం అందజేసిన వారిలో ఆశ యూనియన్ జిల్లా నాయకులు రాధిక ,ఈ లక్ష్మీ ,చంద్రకళ ,విజయలక్ష్మి , భాగ్యమ్మ ,పద్మ ఏం అంజమ్మ, బీ నర్సమ్మ ,వెంకటేశ్వరి, జే.ఆనంద్ ,ఏ కృష్ణవేణి ,జీ సావిత్రి , లక్ష్మి, అనురాధ రమ్య ,వనమాల జి మంగమ్మా తదితలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పి హెచ్ సి ల నుండి ముఖ్య నాయకులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన నాయకులు

**నారాయణపేట ప్రతినిధి మే 11 ప్రజా జ్యోతి**

ఈరోజు కోయిలకొండ మండలంలోని మణికొండ,బోడోని గుట్ట తాండ,నల్లవల్లి,ఆచార్య పూర్,ఉబ్బడి తాండ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించిన నాయకులు.అనంతరం మాట్లాడుతూ

తెలంగాణలో సొంతింటి కల నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని" ప్రవేశపెట్టింది. సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు రూ. 5 లక్షలు ఆర్థిక సహాయం అందిస్తూ, ఇల్లు లేని వారికి ఇల్లు కల్పించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ఈ పథకం ద్వారా, 400-600 చదరపు ఫీట్ల విస్తీర్ణంలో లబ్ధిదారులకు పక్కా గృహాలు నిర్మించి ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.ఇందిరమ్మ ఇండ్ల పథక లక్ష్యం: నిరుపేదలకు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు, అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంత ఇల్లు కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు నింపడం ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు...ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జీన్గరి రవీందర్,ఎమ్మెల్యే గారి వ్యక్తిగత సహాయకులు మాధవ రెడ్డి గారు,సత్య పాల్ రెడ్డి గారు, ఎంపీడీఓ దనుంజయ గౌడ్,హోసింగ్ ాజు, రవి నాయక్, ఆనంద్,నారాయణ రెడ్డి,ఆయా గ్రామాల నాయకులు,కార్యకర్తలు,ఉప గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు...



## అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు

### -ఎమ్మెల్యే డాక్టర్.రాజేష్ రెడ్డి



**నాగర్ కర్నూల్ : మే11(ప్రజా జ్యోతి)**

తిమాజీపేట మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ప్రభుత్వం పేదల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని విజయవంతంగా అమలు చేస్తోందని ప్రతి అర్హులైన కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడం ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మండల్ ప్రెసిడెంట్ వివేక్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరామ్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లయ్య,కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు తిరుపతయ్య,హర్ష వర్ధన్,బహుదూర్ శ్రీనివాస్,లక్ష్మి నారాయణ,మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాధవ్,తదితరులు పాల్గొన్నారు.

## దామరగిద్ద టీఆర్ఎస్ మండల అధ్యక్షుడి నియామకం

**నారాయణపేట ప్రతినిధి మే 11 (ప్రజా జ్యోతి)**



దామరగిద్ద మండల టీఆర్ఎస్ అధ్యక్షుడిగా ఆశన్పల్లికి చెందిన పి.నరసింహారెడ్డి నియమితులయ్యారు.

తెలంగాణ రక్షణ సేన పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. గ్రామస్థాయి నుంచి యువకులు, పెద్దలను కలుపుకొని పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని నరసింహారెడ్డి తెలిపారు. పార్టీ అధిష్టానానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## తహసీల్దార్ కార్యాలయంలో తృటిలో తప్పిన ప్రమాదం

### -పరుగులు తీసిన అధికారులు ప్రజలు

**నారాయణపేట ప్రతినిధి మే 11 (ప్రజా జ్యోతి)**



నారాయణపేటజిల్లా ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయం గేటు ముందు ఉన్న పైకప్పు పెచ్చులూడి కింద పడడంతో సోమవారం తృటిలో ప్రమాదం తప్పింది. దీంతో అధికారులు ,ప్రజలు పరుగులు తీశారు. ఊట్కూర్ తహసీల్దార్ కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం ప్రతినిత్యం వందలాది సంఖ్యలో ప్రజలు వస్తుంటారు. కార్యాలయంలోని వివిధ గదుల పై కప్పులు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్నాయి. గతంలో పైకప్పు పెచ్చులూడి గాయాలైన సంఘటనలు ఉన్న జిల్లా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తహసీల్దార్ కార్యాలయ పైకప్పు మరమ్మతు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఈ సంఘటనపై తహసీల్దార్ చింత రవి నీ వివరణ కోరగా పైకప్పు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న విషయం ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు